గీత దాటితే.. వేటే!

- ప్రతిదీ పర్యవేక్షిస్తున్న ఎన్నికల కమిషన్
- ప్రచారాల్లో పాల్గొంటున్న ఉద్యోగులపై కొనసాగుతున్న సస్పెన్షన్లు
- వలంటీర్లయితే విధుల నుంచి తొలగింపు



చిత్తూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల కమిషన్ ప్రతిదీ పర్యవేక్షిస్తోంది. కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకుంటోంది. ప్రచారంలో పాల్గొంటున్న ఉద్యోగులను సస్పెండు చేస్తుండగా.. వలంటీర్లనైతే విధుల నుంచి తొలగిస్తోంది. ఏ మాత్రం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసినా తమపై కమిషన్ సీరియస్ అవుతుందని అధికారులు కూడా రిస్క్ తీసుకోవడం లేదు. ఇప్పటికే అధికార పార్టీ తరఫున పనిచేస్తున్న గుడుపల్లె మండలం చీకటిపల్లె ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, కుప్పం మండలానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ మురుగేష్, తాజాగా చౌడేపల్లె మండలం బోయకొండ ఆలయంలో కాంట్రాక్టు ఉద్యోగి శంకరను సస్పెండు చేశారు. ఇక, సోమలలో టీడీపీ తరఫున ప్రచారంలో పాల్గొన్నారని ఏఎన్ఎమ్ (రెగ్యులర్ ఉద్యోగి) లతను కలెక్టర్ సస్పెండ్ చేశారు. పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లె ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్ ప్రచారంలో పాల్గొంటున్నారన్న టీడీపీ నాయకుల ఫిర్యాదుపై విచారణ జరుగుతోంది. ఇక, చిత్తూరు కార్పొరేషన్లో 18 మంది, పలమనేరు మున్సిపాలిటీలో 12, గుడిపాలలో ముగ్గురు, పులిచెర్లలో ఇద్దరు, తాజాగా పులిచెర్ల, కార్వేటినగరం మండలాల్లో ఒకొక్కరు చొప్పున, గుడుపల్లెలో ఇద్దరేసి వంతున మొత్తం 39 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించారు. తొలగించిన వలంటీర్లలో ఒకరు పాత తేదీ వేసి తెలివిగా రాజీనామా పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందించారు.వచ్చే ఎన్నికల్లో కష్టపడి పనిచేసి మళ్లీ జగన్‌ను గెలిపించుకోవాలని రాజీనామాలో ఉంది. అంటే, వలంటీర్లు ఉద్యోగం పోయినా సరే వైసీపీ ప్రచారాన్ని మాత్రం ఆపడంలేదని తెలుస్తోంది. దీనివెనుక అధికార పార్టీ ఒత్తిళ్లు ఏమేరకు ఉందో తెలుస్తోంది. ఇక, పలమనేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఫొటోలతో రైటింగ్ ప్యాడ్లు పంపిణీపై ఎమ్మెల్యే వెంకటేగౌడను వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు ఇచ్చింది.ఈ ఘటనకు సంబంధించి కోడ్ ఉల్లంఘన జరిగిందంటూ గుర్తు తెలియని వ్యక్తులపై వి.కోట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలా ఎన్నికల కమిషన్ సీరియస్‌గా స్పందిస్తోంది. ఈ క్రమంలో ఉద్యోగులు జాగ్రత్తగా లేకుంటే వారి ఉద్యోగ భవిష్యత్తు దెబ్బతింటుంది. ఈసీ విషయంలో రాజకీయ పార్టీలు చేసేదేమీ ఉండదని గుర్తుంచుకోవాలి.

చర్యలు కఠినంగా ఉంటాయి

రెగ్యులర్ ఉద్యోగులే కాదు.. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సహా వలంటీర్లు కూడా ఎన్నికల నియామావళిని కచ్చితంగా అనుసరించాల్సిందే. ఏ మాత్రం గీత దాటితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. ఎన్నికల కమిషన్ ప్రతి అంశాన్నీ పర్యవేక్షిస్తోంది.

- షన్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

కోడ్ ఉల్లంఘించిన ఏఎన్ఎం సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్/సోమల: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన రెగ్యులర్ ఏఎన్ఎం లతను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ ఎర్రమిట్టకు చెందిన ఈమె.. చౌడేపల్లె-2 సచివాలయంలో రెగ్యులర్ ఏఎన్ఎంగా పని చేస్తున్నారు. ఆమె ఇరికిపెంటలో టీడీపీ నాయకుల ప్రచారంలో పాల్గొన్నారంటూ జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదులు అందాయి. దీనిపై కలెక్టర్ విచారణ జరిపి సస్పెండు చేశారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

- లేకుంటే అడ్డుకుంటున్న అధికారులు

ఆంధ్రజ్యోతి, చిత్తూరు: ఆయా పార్టీల నుంచి బరిలో ఉన్న అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీలకే కాదు, ఇంటింటి ప్రచారానికి కూడా కోడ్ నిబంధనల మేరకు ముందస్తు అనుమతులు తీసుకోవాలి. ఆర్వోల నుంచి మ్యానువల్‌గా, సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చు. 48 గంటల్లో అనుమతి లభిస్తుంది. పలువురు అభ్యర్థులు ఈ విషయం తెలియక ప్రచారం చేస్తుండడంతో కోడ్ అమలును పర్యవేక్షించే ఫ్లయింగ్ స్క్వాడ్ అడ్డుకున్న ఘటనలున్నాయి. మంగళవారం జీడీనెల్లూరు నియోజకవర్గంలో తొలుత వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిని, ఆ తర్వాత టీడీపీ అభ్యర్థి థామస్ ప్రచారాన్ని అడ్డుకున్నారు. వీరు దరఖాస్తు చేసుకోగా.. అదే రోజు సాయంత్రానికి ఆర్వో అనుమతులిచ్చారు. అలాగే, బుధవారం బైరెడ్డిపల్లె మండలంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ప్రచారాన్నీ అడ్డుకున్నారు. ఆ తర్వాత ఆర్వో వద్ద అనుమతి తీసుకుని ఆయన ప్రచారం చేసుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : సా. 6.29

సహరి (శుక్రవారం) : ఉ. 4.55

పులిచెర్ల మండలంలో వలంటీరు తొలగింపు

- ఉపాధి క్షేత్రసహాయకుడిపై విచారణ నివేదిక అందజేత

కల్లూరు, మార్చి 20: పులిచెర్ల మండలంలో ఈనెల 17న వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన ద్విచక్ర వాహన ర్యాలీలో కల్లూరు పంచాయతీకి చెందిన వలంటీరు ఖాదర్‌బాషా పాల్గొనడంపై అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై విచారించి ఆయన్ను విధుల నుంచి తొలగించారు. ఇదే ర్యాలీలో పాల్గొన్న దిగువపోకలవారిపల్లి పంచాయతీకి చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు ప్రసాద్‌పైనా టీడీపీ నాయకులు సీ-విజిల్, ఎంపీడీవోకు బుధవారం ఫిర్యాదు చేశారు. క్షేత్రసహాయకుడు ప్రసాద్‌ని ఎంపీడీవో విచారించి రాతపూర్వకంగా సంజాయిషీని తీసుకున్నారు. ఈ విచారణ నివేదికను డ్వామా పీడీ రాజశేఖర్‌కు పంపామని ఎంపీడీవో తెలిపారు. కాగా, ఇదే ర్యాలీకి సంబంధించి అందిన ఫిర్యాదులపై ఇప్పటికే వెంకటదాసరపల్లి పంచాయతీకి చెందిన ఇద్దరు వలంటీర్లను తొలగించగా, అయ్యావాండ్లపల్లి పంచాయతీకి చెందిన ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకుడిపై ఉన్నతాధికారులకు మంగళవారం ఎంపీడీవో నివేదిక అందించారు.



ర్యాలీలో క్షేత్రసహాయకుడు ప్రసాద్ పాల్గొన్నట్లు ఫిర్యాదుతో పాటు టీడీపీ నేతలు ఇచ్చిన ఫొటో



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు

మారేట్లు లేరుగా!

- వైసీపీ ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

కుప్పం, మార్చి 20: ఒకవైపు అధికారులు చర్యలు తీసుకుంటున్నా, మరోవైపు తమదారి తమదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు పంచాయతీ స్థాయి ఎన్ఆర్జీఎస్ ఉద్యోగులు. ఇంతదాకా వలంటీర్లే అనుకుంటే ఇప్పుడు ఉపాధి హామీ సిబ్బంది కూడా వైసీపీ ఎన్నికల ప్రచారంలో యథేచ్ఛగా పాల్గొనడం ప్రారంభమైంది. తాజాగా బుధవారంగుడుపల్లె మండలం బెగ్గిలపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు వైసీపీ తరఫున బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బెగ్గిలపల్లె పంచాయతీ గణేశ్‌పురం క్రాస్ సీతారాముల ఆలయం ఎదుట జడ్పీటీసీ కృష్ణమూర్తి, ఎంపీపీ వరలక్ష్మితో కలిసి, పార్టీ టోపీ వేసుకుని మరీ ఫీల్డ్ అసిస్టెంట్ దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, ఇప్పటికే ఇదే మండలానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ వైసీపీ ప్రచారంలో.. ఎమ్మెల్సీ భరత్ పీఏగా డిప్యుటేషన్ మీద ఉన్న కుప్పం మండల టెక్నికల్ అసిస్టెంట్ మురుగేశ్ అధికార పార్టీ ప్రతినిధిగా ఆర్వో సమావేశంలో పాల్గొని.. సస్పెండైన విషయం తెలిసిందే.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్ల తొలగింపు

కుప్పం, మార్చి 20: గుడుపల్లె మండలంలో వైసీపీ తరఫున మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్లను బుధవారం విధులనుంచి తొలగించారు. గుడుపల్లె మండలం సోడిగానిపల్లె పంచాయతీ మల్దేపల్లె గ్రామంలో వలంటీరు బాలరాజు వైసీపీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఇదే మండలానికి చెందిన పెద్దబజనవాడలో వలంటీరు రాజశేఖర్ వైసీపీ వాల్ పెయింట్లు వేస్తుండటంపై పత్రికలు, సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాల్సిందిగా కుప్పం నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీనివాసులును కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. వలంటీర్లు ప్రచారంలో పాల్గొన్నది నిజమేనని నిర్ధారణ కావడంతో ఆ ఇద్దరినీ విధుల్లోనుంచి తొలగించారు.

బోయకొండ కాంట్రాక్ట్ ఉద్యోగిపై వేటు

చౌడేపల్లె: వైసీపీ తరఫున ప్రచారం చేసిన బోయకొండ కాంట్రాక్ట్ ఉద్యోగి శంకరప్పను సస్పెండ్ చేసినట్లు ఆలయ ఈవో చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న శంకరప్ప వైసీపీ తరఫున ప్రచారం చేస్తున్నట్లు విచారణలో తేలటంతో పుంగనూరు రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

అమరరాజాకు జపాన్ ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న అమరరాజా ఉద్యోగులు

రేణిగుంట, మార్చి 20: జపాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ మెయింటెనెన్స్ టీపీఎం అవార్డును అమరరాజా బ్యాటరీస్ పొందింది. అమరరాజా ఎనర్జీ, మొబిలిటీ రెండు యూనిట్లు జపాన్‌లోని టోక్యోలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రతిష్ఠాత్మకమైన టోటల్ ప్రొడక్టివ్ మెయింటెన్స్ అవార్డులను గెలుచుకుంది. ఈ అవార్డులను అమరరాజా చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ సి.నరసింహులు నాయుడు, ఇండస్ట్రియల్ డివిజన్ ఆపరేషన్స్ హెడ్ శ్రీనివాస రావు, ఆటోమోటివ్ డివిజన్ ఆపరేషన్స్ హెడ్ మునీశ్వరనాయుడు, సుభాష్, టీపీఎం కోఆర్డినేటర్ రాజేష్, బిజినెస్ హెచ్ఆర్ ఈశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడానికి, టోటల్ ప్రొడక్టివ్ మెయింటెన్స్ అమలు చేయడంతో అద్భుతంగా పనిచేస్తున్న పరిశ్రమలకు ఈ అవార్డులను అందజేస్తున్నారని, తమ కంపెనీకి ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

సభలు, ర్యాలీలు, ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20: అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారాలు, సభలు, ర్యాలీలను నిర్వహించరాదని జేసీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ పార్టీల నాయకులు, ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాలతో సమావేశమయ్యారు. పార్టీ నాయకులు నేరుగా ఆర్వో నుంచీ లేదా సువిధ యాప్ ద్వారా అనుమతి పొందాలని సూచించారు. లేదంటే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచార సామగ్రికి సంబంధించి ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతి పొందిన తర్వాతే పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, కరపత్రాల ముద్రణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అరుణ, సమాచారశాఖ డీఐపీఆర్ పద్మజ, డీపీవో లక్ష్మి, ఏఈఆర్వోలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీరు రాజీనామా

కార్వేటినగరం, మార్చి 20: కార్వేటినగరం మండలం సురేంద్రనగరంలో వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీరు రఫీ ఉన్నారు. ఇతడిపై అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీనిపై విచారించి అధికారులు వేటు వేస్తారని భావించిన ఆ వలంటీరు వలంటీరు రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పంచాయతీ ఈవో మణికి అందజేశారు.

వాహనసేవలో అపశ్రుతి : యువకుడి మృతి


గోపీకృష్ణ (ఫైల్‌ఫొటో)

నగరి, మార్చి 20: నగరి పట్టణ పరిధి సత్రవాడలోని చిదంబరేశ్వస్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం అధికార నందివాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనం అదుపు తప్పడంతో దాని కింద పడిన గోపీకృష్ణ(18) తీవ్రంగా గాయపడినట్లు సీఐ సురేష్ తెలిపారు. స్థానికంగా ప్రథమచికిత్స అందించి తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం గోపీకృష్ణ మృతి చెందాడు. ఇటీవల ఇతడు ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు రాశారు. ఇతడి మృతితో స్థానికంగా విషాదఛాయలు నెలకొన్నాయి.

వాహనాలపై నేతల బొమ్మలు ఉండకూడదు

చిత్తూరు, మార్చి 20: ప్రభుత్వానికి సంబంధించిన అన్ని వాహనాలపై రాజకీయ బొమ్మలు, గుర్తులు ఉండరాదని ఏఆర్వో కమిషనర్ అరుణ స్పష్టం చేశారు. బుధవారం ఆమె ప్రభుత్వ సంస్థల వాహనాలైన 108, 104, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్, ఇంటింటికి రేషన్ సరఫరా చేసే వాహనాలను తనిఖీ చేశారు. అన్ని వాహనాలను వాహనాల షెడ్డుకు తీసుకొచ్చి లోగోలు, ఇతర రాజకీయ పరమైన బొమ్మలు ఉన్నాయా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్యానికి రంగవల్లుల పోటీలు





చిత్తూరు, మార్చి 20: 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని కట్టమంచి చెరువు వద్ద బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఓటింగ్ ప్రక్రియ, ఈవీఎంల వినియోగం, ఈవీఎం నమూనా, ఓటరు చైతన్యం, నైతికత అంశాలపై మహిళలు ముగ్గులు వేశారు. వీటిలో ఉత్తమ మూడు ముగ్గులను మెప్మా సిబ్బంది ఎంపిక చేసి.. బహుమతులు అందించారు. స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, ఆర్ఐలు వెంకటేశ్, స్వీప్ బృందం, మెప్మా సీవోలు, మహిళలు పాల్గొన్నారు.

రేకుల షెడ్డు పీకేస్తామంటూ వైసీపీ బెదిరింపులు

చిత్తూరు సిటీ, మార్చి 20: తాము నివాసముంటున్న రేకుల షెడ్డునూ పీకేస్తామంటూ వైసీపీ నేత బెదిరిస్తున్నారని జీడీ నెల్లూరు మండలం రామానాయుడు పల్లికి చెందిన పొన్నుస్వామి ఆరోపించారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు 70 సంవత్సరాలుగా తమ అధీనంలో 4 సెంట్ల భూమి ఉందన్నారు. గ్రామస్థుల తీర్మానంతో రెండు సెంట్లను కమ్యూనిటీ భవనానికి ఇవ్వగా, మగిలిన రెండు సెంట్లలో రేకుల షెడ్డువేసుకుని నివాసం ఉంటున్నట్లు చెప్పారు. ఆ రెండు సెంట్లను ఆక్రమించేందుకు అధికార పార్టీనేతలు రేకుల షెడ్డును పీకేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నేతలకు పంచాయతీ కార్యదర్శి వత్తాసుపలుకుతూ తనకు నోటీసు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని, ఉన్నతాధికారుల స్పందించి తనకు, తన భూమికి రక్షణ కల్పించాలని కోరారు.

కోడ్ అంటే లెక్కలేదా?

● నేడు ఆలయ పాలకమండలి సమావేశం

చిత్తూరు కల్చరల్, మార్చి 20: చిత్తూరు నగరం గిరింపేటలోని దుర్గాంబ ఆలయ పాలకమండలి సమావేశం గురువారం నిర్వహించనున్నారు. ఎన్నికల కోడ్‌కు కొంచెం ముందు ఆగమేఘాల మీద పాలకమండలిని నియమించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఆలయ పాలక మండలి ఎలాంటి అధికార కార్యక్రమాలు చేపట్టకూడదు. కేవలం ఈవో మాత్రమే కార్యక్రమాలు నిర్వహించాలి. ఇవన్నీ కాదని పాలకమండలి తమ తొలి సమావేశాన్ని నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం పట్ల విమర్శలు వస్తున్నాయి.

బాణసంచా కేంద్రం పేలుడులో గాయపడిన ఇద్దరి మృతి

సూళ్లూరుపేట, మార్చి 20: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో మంగళవారం బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో గాయపడిన ఆరుగురిలో ఇద్దరు బుధవారం మృతి చెందారు. గాయపడిన ఆరుగురిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నై కేఎంసీ వైద్యశాలకు తరలించారు. శరీరం 90 శాతానికి పైగా కాలిపోయిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ (18), రవి (21) బుధవారం రాత్రి మృతి చెందారు. వీరిద్దరూ టపాసుల తయారీ కేంద్రంలో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరితోపాటు తీవ్రంగా గాయపడిన వత్రపాలేనికి చెందిన శివకుమార్ పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు ఎస్ఐ రహీం రెడ్డి తెలిపారు.

రంగు మారింది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కార్వేటినగరం మండల కాంప్లెక్స్ ప్రవేశద్వారం, ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం గోడలకు వైసీపీ రంగులు మారాయి. ఎన్నికల కోడ్ వచ్చినా ఈ రంగులు అలాగే ఉండటంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎన్నికల అధికారులు ఆ రెండు భవనాలకు వైసీపీ రంగుల స్థానంలో తెల్ల రంగు వేయించారు.

\- కార్వేటినగరం



ఈ రంగుల్ని ఏం చేస్తారు?


వైసీపీ రంగులతో ఉన్న ఉగ్రాణంపల్లి రైతుభరోసా కేంద్రం

పెనుమూరు, మార్చి 20: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నాలుగు రోజులు అవుతున్నా కొందరు అధికారులు ఉదాసీనంగా ఉంటున్నారు. సామిరెడ్డిపల్లి సచివాలయ పరిధిలో ఉగ్రాణంపల్లిలో ఉన్న రైతుభరోసా కేంద్రానికి వైసీపీ రంగులతో ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఈ హోర్డింగులు ఎప్పుడు తొలగిస్తారో?

వెదురుకుప్పం, మార్చి 20: వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో ఇంకా పలుచోట్ల హోర్డింగులు, ఫ్లెక్సీల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, గుర్తులు కనిపిస్తూనే ఉన్నాయి. వాటిని కనిపించకుండా చర్యలు తీసుకోవడంలో అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కిస్తుండటం ఆరోపణలకు తావిస్తోంది.


వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో కోడ్ కూసినా ఇలా..

ఈ నీటి ట్యాంకు మాటేంటి?

కార్వేటినగరం, మార్చి 20: కార్వేటినగరం పంచాయతీ కోట చెరువు దళితవాడ, పద్మసరస్సు వద్ద ఉన్న రెండు నీటి ట్యాంకులకు వైసీపీ రంగులు ఉన్నాయి. పుత్తూరు - చిత్తూరు జాతీయ రహదారి పక్కనే నీటి ట్యాంకులకు వేసిన వైసీపీ రంగులను అధికారులు ఇంకా తొలగించలేదు. కొన్ని ఇళ్లకు జగనన్న నువ్వే మా నమ్మకం అంటూ వేసిన సిక్కర్లనూ తొలగించలేదు. దీనిపై కాంగ్రెస్ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.







బోయకొండ క్రాస్‌లో రెపరెపలాడుతున్న వైసీపీ జెండా - గడ్డంవారిపల్లెలో ఓ ఇంటి ముందు ఉన్న మానమ్మకం నీవే జగన్ బోర్డు

చౌడేపల్లె, మార్చి20: చౌడేపల్లె మండలంలో పలువురు అధికారులు ఎన్నికల కోడ్ పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. బోయకొండ క్రాస్ వద్ద వైసీపీ జెండా ఇప్పటికీ ఎగురుతోంది. గడ్డంవారిపల్లెలో ఓ ఇంటి ముందు మానమ్మకం నీవే జగన్ అనే బోర్డును తొలగించలేదు. జిల్లా ఎన్నికల అధికారి స్పందించి ఎన్నికల కోడ్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల విధులు వద్దు!

● కలెక్టరేట్‌కు క్యూ కడుతున్న ఉద్యోగులు
● ఇప్పటికే 1200 దరఖాస్తుల రాక

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20: ఎన్నికల విధులు వద్దంటూ పలువురు ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటున్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానానికి ఎన్నికల నిర్వహణకోసం రిజర్వుతో కలిపి 12,750 మంది అవసరం. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఎన్నికల విధులకోసం ఎంపిక చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ పేరిట వారందరికీ నియామక ఉత్తర్వులను పంపారు. అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్, గుండె జబ్బు ఉన్నవారు, నడవలేని స్థితిలో వున్నవారు తదితర కేటగిరిలకు చెందిన వారికి మాత్రమే విధుల నుంచి మినహాయింపు ఇస్తున్నారు. కాగా ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని చాలామంది చిన్నచిన్న అనారోగ్య సమస్యలను కూడా సాకుగా చూపుతున్నారు. ఇలా మినహాయింపులు కోరుతూ ఇప్పటివరకు 1200 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజులుగా జేసీ శ్రీనివాసులు ఆ దరఖాస్తులను పరిశీలించి అర్హులైనవారిని గుర్తిస్తున్నారు. బుధవారం 164 మందిని కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు స్వయంగా వచ్చి డీఆర్వో పుల్లయ్య డాక్టర్లచే ధ్రువీకరించిన సర్టిఫికెట్లు తీసుకొచ్చినవారిని పక్కాగా పరిశీలనచేశారు. అర్హత ఉంటే మినహాయింపు ఇస్తున్నారు. లేదంటే విధులకు రావాల్సిందేనని చెప్పి పంపారు. దీంతో దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా మరికొందరు దరఖాస్తులు చేసుకోకుండా డీఆర్వో పుల్లయ్యను కలిసేందుకు చేతిబిడ్డలతో సహా మహిళలు నేరుగా వచ్చారు. మినహాయింపు కోరుతూ దరఖాస్తు చేసుకున్నవారు తప్ప ఇతరులు నేరుగా కలెక్టర్‌ను లేదా జేసీని సంప్రదించాలని ఆయన చెప్పడంతో వారందరూ వెనుదిరిగారు. ఈ విధంగా రోజుకు వందలాది మంది సర్టిఫికెట్లతో కలెక్టరేట్‌కు వస్తున్నారు. అయితే ఎవ్వరికీ కూడా మినహాయింపు ఇచ్చేది లేదంటూ కలెక్టర్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే.


విధుల మినహాయింపు కోరుతూ సర్టిఫికెట్లతో డీఆర్వో చాంబర్ వద్ద వేచివున్న ఉద్యోగులు

చిత్తూరుకు చేరిన 1.1 లక్షల ఓటరు కార్డులు


కలెక్టరేట్‌లో ఓటరు కార్డుకు స్టాంపింగ్ వేస్తున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో చివరి విడతగా 1,10,000 ఓటరు కార్డులు జిల్లా కేంద్రానికి చేరాయి. వాటికి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఎన్నికల సిబ్బంది స్టాంపింగ్ ప్రక్రియ చేపట్టారు. పోస్టల్ శాఖ వీటిని రిజిష్టర్ పోస్టులో ఓటర్లకు పంపుతుంది. నోడల్ ఆఫీసర్ పర్యవేక్షణలో స్టాంపింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకోసం సమీప మండలాల్లో వీఆర్ఏలను రప్పించారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జేసీ


కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20: సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో మే13న పోలింగ్ జరుగుతుంది. 21రోజుల విరామం తర్వాత జూన్ 4న ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. ఇందుకోసం జిల్లా యంత్రాంగం చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారిలోని ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలను ఓట్ల లెక్కింపు కేంద్రంగా గుర్తించింది. పోలింగ్ తర్వాత అన్ని నియోజకవర్గాల నుంచి చేరే వీవీ ప్యాట్లను ఇక్కడ ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరచనున్నారు. బుధవారం జేసీ శ్రీనివాసులు ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలు, వాహన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య పాల్గొన్నారు.

టెన్త్ ఇంగ్లీష్ పరీక్షకు 442 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 20: జిల్లాలో బుధవారం జరిగిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు 442 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. 21,425 మంది విద్యార్థులకు గాను 20,983 మంది హాజరు కాగా, 442 మంది గైర్హాజరైయారు. ● మధ్యాహ్నం జరిగిన ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలకు 1062 మందికిగాను 996 మంది హాజరుకాగా, 66 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో 3859 మందికి గాను 3723 మంది హాజరు కాగా 136 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఒకటి నుంచి టెన్త్ మూల్యాంకనం

టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పంపిన ఉత్తర్వులు జిల్లాకు చేరాయి. ఈ క్రమంలో పరీక్షల విభాగం అధికారులు స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్పాట్ నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. ఇంటర్మీడియట్ మూల్యాంకనం ఏప్రిల్ 4వ తేదీకి ముగియనుంది.

మళ్లీ వచ్చిన ఏనుగులు

సోమల, మార్చి20: సోమల మండలంలోకి మంగళవారం రాత్రి ఏనుగులు మళ్లీ ప్రవేశించి పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదుం మండలంలో సంచరిస్తున్న ఏనుగులు గురికానివారిపల్లె సమీపంలోని మామిడి, కొబ్బరి, వరి పొలాల్లో సంచరించి పంటలను తొక్కివేశాయి. గురికానివారిపల్లెకు చెందిన కె. మహేశ్వర మామిడి తోటలో సంచరించి 20చెట్ల కొమ్మలను విరిసేయడంతో కోతకు వస్తున్న మామిడి పిందెలు నేలరాలాయి. గుర్రప్పకు చెందిన కొబ్బరి తోటలోను, అమీర్ సాబ్‌కు చెందిన వరి పొలంలో తిరగాడి పంటలను ధ్వంసం చేశాయి. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగుల బెడద నుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు. ఈ మేరకు రైతులు బుధవారం సచివాలయం, సోమల తహసీల్దార్ కార్యాలయ అధికారులకు ఫిర్యాదులు చేశారు.


గురిగానివారిపల్లె సమీపంలో వరిపైరును తొక్కేసిన ఏనుగులు


గుంతలో పడివున్న వాహనాన్ని బయటకు తీస్తున్న స్థానికులు


మృతుడు రుక్మాంగదరెడ్డి (ఫైల్ ఫొటో)

మున్సిపల్ నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి

చింతలగుంటలో పార్కు ఏర్పాటు పనులు - పునాదుల కోసం తీసిన గోతిలో పడి ఒకరు మృతి

పుత్తూరు అర్బన్, మార్చి 20:పుత్తూరు మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగ అధికారుల నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైంది.నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో జరుగుతున్న పనులకు సంబంధించి కనీస భద్రతా చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు నిర్లిప్తంగా వ్యవహరించడంతో ఒక కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది.వివరాల్లోకి వెళితే... పుత్తూరు పట్టణానికి చెందిన రుక్మాంగద రెడ్డి(55) లక్ష్మీనగర్‌లో నివాసముంటున్నాడు.బుధవారం మధ్యాహ్నం పట్టణంలోకి వెళ్లి చింతలగుంట మీదుగా ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తున్నాడు.ఈ క్రమంలో మున్సిపల్ పార్కు ఏర్పాటు కోసం ప్రహరీగోడ నిర్మాణంలో భాగంగా తీసిన పునాదుల గుంతలో ప్రమాదవశాత్తూ పడ్డాడు. ద్విచక్ర వాహనం మీద పడడంతో స్పృహ కోల్పోయాడు.అక్కడే పనుల్లో ఉన్న కూలీలు రుక్మాంగదరెడ్డిని బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు లేకపోవడంతో పోలీసు కేసు నమోదు కానట్లు తెలిసింది. చింతలగుంట ఉన్న ప్రదేశంలో విద్యాసంస్థలుండడంతో రద్దీగా ఉంటుంది. ఇదేదారిలో వందలాది మంది విద్యార్థులు, స్థానికులు వెళుతుంటారు. రోడ్డుకు ఆనుకుని పునాదులు తీస్తుండడంతో భద్రతా చర్యలు తీసుకోవాలనే కనీస ఇంగితం కూడా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగానికి లేకపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం ఇదే పునాదుల గుంతలో కుక్కపిల్ల పడిపోయింది. దానిని బయటకు తీసే క్రమంలో టీడీపీ నాయకుడు షణ్ముగరెడ్డికి, మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి అనుచరుడికి మధ్య జరిగిన దా డి, పోలీసు ఫిర్యాదులు, కేసుల నమోదు వరకు వెళ్లింది. ఆ సంఘటనతోనైనా అధికారులు మేలుకొని ఉండాల్సింది. పునాదుల కోసం తీసిన గుంతల వద్ద బారికేడ్ల ఏర్పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసివుంటే బుధవారం ఒక వ్యక్తి మృతి చెందాల్సిన పరిస్థితి ఉండేది కాదనే మాటలు వినబడుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన అన్ని వైపుల నుంచి విమర్శలు రావడంతో మున్సిపాలిటీ దిద్దుబాటు చర్యలు తీసుకుంది. హడావిడిగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేసింది.

విధుల్లో మద్యం తాగిన రుయా ఉద్యోగి సస్పెన్షన్

తిరుపతి(వైద్యం), మార్చి 20: తిరుపతి రుయాస్పత్రి ఆవరణలో విధుల్లో ఉన్న సమయంలోనే మద్యం తాగిన ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ రవిప్రభ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.రుయాస్పత్రి ఆవరణలో సీఐటీయూ అనుబంధ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నాలుగు రోజుల కింద వాటర్‌మ్యాన్ నాంపల్లి సుబ్రహ్మణ్యం మరో వ్యక్తితో కలిసి మద్యం తాగుతూ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ విషయంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో స్పందించిన సూపరింటెండెంట్.. విచారణకు ఆదేశించారు. మద్యం తాగింది వాస్తవమేనని తేలడంతో సుబ్రహ్మణ్యాన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, యూఎంహెచ్ఈ యూనియన్ కార్యాలయంలో మద్యం తాగడాన్ని సీఐటీయూ తీవ్రంగా భావించి యూనియన్ అధ్యక్ష పదవి నుంచి సుబ్రహ్మణ్యాన్ని తప్పించడంతో పాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఓటు హక్కుపై మానవహారం



సోమల, మార్చి 20: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ దానిని సద్విని యోగం చేసుకోవాలని ఏపీఎం శివ కోరారు. బుధవారం వెలుగు మహిళలు తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ జరిపారు. అనంతరం స్థానిక బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. 18 ఏళ్లు నిండిన నూతన ఓటర్లు విధిగా ఓటును వినియోగించుకునే విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని స్వయం సహాయ బృందాల సభ్యులను కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీసీలు నరసింహులు, గంగోజీ, సంఘ మిత్రలు కుమారి, సుగుణ, శాంతమ్మ పాల్గొన్నారు.

ఓటర్ల చైతన్యం కోసం మెప్మా ర్యాలీ



పలమనేరు, మార్చి20 : పలమనేరులో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం ఓటర్ల చైతన్య ర్యాలీని నిర్వహించారు. రాబోవు ఎన్నికల సందర్భంగా ప్రజలను చైతన్య పర్చేందుకు గాను, ప్రజలు ఎన్నికల తేదీనాటికి వారి ఓటును సద్వినియోగం చేసుకొనేందుకుగాను వారిలో అవగాహన పెంచేందుకు ఈ ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీలో బీఎల్‌ఓలు, వార్డు సచివాలయాల సెక్రటరీలు పాల్గొన్నారు.

ఓటు హక్కుతో భవిత మారుతుంది



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

కుప్పం, మార్చి 20: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా భవితనే మార్చుకోవచ్చని కుప్పంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జే.లక్ష్మీనారాయణ అన్నారు. నెహ్రూ యువకేంద్ర సంఘటన్, యువ భారత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం ఓటు హక్కుపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తోపాటు పలువురు వక్తలు మాట్లాడుతూ ఓటు హక్కు ఎంతో పవిత్రమైనదని, అభ్యర్థి గుణగణాలు ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకుని ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువ భారత్ అధ్యక్షుడు ఆర్.వేకాంత్, వైస్ ప్రిన్సిపాల్ వి.నారాయణమూర్తి, గణేశ్, గురుప్రసాద్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ బాగుపడాలంటే బాబు సీఎం కావాలి

గుడుపల్లె, మార్చి 20: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుపడుతుందని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. బుధవారం టీడీపీ శ్రేణులు కనమనపల్లె పంచాయతీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసీపీ పాలన అంతా అవినీతిమయం అని, అన్ని వర్గాల సంక్షేమం ఒక్క టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు. ప్రతి ఇంటా సూపర్ సిక్స్ పథకాలు వివరించి కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బాబునాయుడు, చంద్రశేఖర్, మునిరాజు, బేటప్ప నాయుడు, హేమాంబర్ గౌడు, జనసేన మండలాధ్యక్షులు అమీర్, మున్నీర్, నారాయణమూర్తి, ఉదయ్‌కుమార్, ప్రకాష్, వెంకటేశ్, ఎల్లప్ప, సుబ్బు, తిరుపతి, భానుమూర్తి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు పార్లమెంటులో టీడీపీ విజయానికి కృషి

వన్నెకుల క్షత్రియ నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

కుప్పం, మార్చి 20: చిత్తూరు పార్లమెంటు స్థానంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని ఆ పార్టీకి చెందిన వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గం నేతలు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడిగా సీఆర్.రాజన్ నియామకంపట్ల హర్షం వ్యక్తం చేశారు. రాజన్‌పై నమ్మకం ఉంచి, పదవిని కట్టబెట్టిన పార్టీ అధినేత చంద్రబాబుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వన్నెకుల క్షత్రియుల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కుప్పంలో ఆయనకు లక్ష ఓట్ల మెజారిటీ వచ్చేందుకు తమవంతు పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు జీఎం.రాజు, సాంబశివం, ఏపీ.రవి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నేతలు



రామకుప్పం, మార్చి 20: రామకుప్పం మండలం గొరివిమాకులపల్లెకు పంచాయతీ పెద్దగెరిగెపల్లె, చిన్నగెరిగెపల్లెలకు చెందిన వైసీపీ నేతలు ప్రవీణ్, సుబ్రహ్మణ్యంరెడ్డిలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం కుప్పం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం, చంద్రబాబు పీఏ మనోహర్‌లు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, ప్రశాంత వాతవరణం ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ టీడీపీకి అండగా నిలవాలని కోరారు కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగుయువత అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు మహ్మద్‌రఫీ, గంట్లప్పగౌడు, బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మనోహర్, మాజీ సర్పంచు జేయి పాల్గొన్నారు.

గుండ్లసాగరంలో పాడి ఆవుల దొంగలు

గుడుపల్లె, మార్చి 20: మండలంలోని గుండ్లసాగరంలో ఇద్దరి రైతులకు చెందిన పాడి ఆవులను మంగళవారం రాత్రి తీసుకుపోయారు. స్థానికుల వివరాల మేరకు... గుండ్లసాగరానికి చెందిన జమీర్, షంషాద్ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం ఉంది. అక్కడ వీరు ఇరువురు రెండు పాడి ఆవులు పెంచుకుంటున్నారు. మంగళవారం రాత్రి పశువుల కొట్టంలో దొంగలు పడి వీరి రెండు పాడి ఆవులను తీసుకుపోయారు. బుధవారం పాడి ఆవులు కనపడకపోవడంతో చుట్టు పక్కల వెతికారు. ఆవుల జాడ కనిపించకపోవడంతో రైతులు గుడుపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అగర్వాల్ ఐ క్లినిక్ ప్రారంభం

పలమనేరు: పలమనేరులో గురువారం అగర్వాల్ ఐ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, డాక్టర్ అగర్వాల్ ఐ క్లినిక్ వైస్ ప్రెసిడెంట్ గణేష్ అగర్వాల్, మెడికల్ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, మేనేజర్ శివనాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ప్రహ్లాద పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఇంటికే : ఆర్వో

పుంగనూరు, మార్చి20: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఇంటికి వెళ్లక తప్పదని ఆర్వో మధుసూధన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలతో కలసి తిరగడం, వారికి అనుకూలంగ వ్యవహరించరాదన్నారు. ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకుని పని చేయాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాల్సి వుంటుందన్నారు. ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శివయ్య, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్వో మధుసూదన్‌రెడ్డి

48 గంటల ముందు అనుమతి తప్పనిసరి : ఆర్డీవో

పలమనేరు : ఏ రాజకీయ పార్టీ నాయకులైనా ఎన్నికల ప్రచారానికి 48 గంటల ముందే నియోజకవర్గ ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరి అని ఆర్డీవో మనోజ్‌రెడ్డి తెలిపారు. గురువారం బైరెడ్డిపల్లి మండలం బేలుపల్లిలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని అధికారులు నిలిపి వేశారని, ఎన్నికల నిబంధనల మేరకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సివుంటుందని తెలియజేశారు. గురువారం మాత్రం బేలుపల్లిలో ప్రచారం నిర్వహించుకునేందుకు అమరనాథరెడ్డికి అనుమతి ఇచ్చామన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొనే వాహనాలకు సైతం ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. ఏఏ గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, ఏఏ నంబర్లు కలిగిన వాహనాలు వినియోగిస్తున్నారో కూడా ముందుగా నియోజకవర్గ ఎన్నికల అధికారికి తెలియజేసి అనుమతి తీసుకోవాల్సి వుంటుందన్నారు. ఏ ప్రచార కార్యక్రమానికి అయినా 10 వాహనాల లోపు అనుమతి ఇస్తామన్నారు. ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా వుండాలని ఈ నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇది కూడా ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకే అని తెలియజేశారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి

బైరెడ్డిపల్లె, మార్చి 20 : రాష్ట్ర భవిష్యత్తుకోసం రాబోయే ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటేసి టీడీపీని గెలిపించాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి కోరారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం బేలుపల్లె పంచాయతీ పరిధిలో ఆయన పర్యటించారు. టీడీపీ అధికారంలోకివస్తే అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలగురించి వివరిస్తూ టీడీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతోవుందన్నారు. ఇదిలావుండగా బేలుపల్లెలో పర్యటనకు వచ్చిన అమరనాథరెడ్డిని అనుమతి లేదంటూ కొంతసేపు అధికారులు అడ్డుకున్నారు. తాము ప్రచార వాహనాలు ఉపయోగించడం లేదని, ఎలాంటి కరపత్రాలు పంపిణీ చేయడం లేదని ఆయన అధికారులకు వివరించారు. ఆర్డీవో అనుమతి తీసుకుని కార్యక్రమం నిర్వహించుకోవాలని అధికారులు సూచించడంతో అమరనాథరెడ్డి వెంటనే ఆర్డీవో కార్యాలయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాహనాల అనుమతి కోసం మంగళవారమే ఆర్డీవో కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. అయితే మళ్లీ ఒక వినతిపత్రం సమర్పించాలని అధికారులు కోరడంతో ఆయన వెంటనే పంపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి, నాయకులు రఘుచంద్రగుప్తా, సుబ్రమణ్యంరెడ్డి, రామచంద్రనాయుడు, నాగరాజు, పయణి, భువనచంద్రగౌడు, రమేష్, లోకనాథరెడ్డి, విల్వనాథ్, అమరనాథరెడ్డి, మధు, పరమేష్, చలపతి, సురేష్, జలంధర్, జనసేన నాయకులు పసుపులేటి దిలీప్, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బేలుపల్లెలో టీడీపీ, జనసేన శ్రేణులతో అమరనాథరెడ్డి

చంద్రబాబుకు ఓటు.. అభివృద్ధికి చోటు

కుప్పం, మార్చి 20: చంద్రబాబుకు ఓటే వేయడం అభివృద్ధికి చోటు కల్పించడమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మున్సిపాలిటీ 13వ వార్డులో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్ ఆధ్వర్యంలో యవకులు పెద్దయెత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న పీఎస్ఎం మాట్లాడుతూ ఒక్కసారి గతం గుర్తు చేసుకుంటే కుప్పం ఎలా ఉన్నదో, చంద్రబాబు వచ్చాక ఎలా మారిందో తెలుస్తుందన్నారు. ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి గురించి యువకులకు తెలియజెప్పాల్సిన బాధ్యత పెద్దలకు ఉందన్నారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంచిపెట్టి వాటిద్వారా చేకూరే లబ్ధిని ఓటర్లకు వివరించారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, కన్నన్, వెంకటేశ్, 13వ వార్డు పార్టీ అధ్యక్షుడు లోకేశ్, బూత్ ఇన్‌చార్జి ఎస్‌కే.మణి, రాహుల్, టి.సుకుమార్, మోహన్, మురళి పాల్గొన్నారు.



కుప్పం కొత్తపేటలో ప్రచారంలో పీఎస్ఎం, అప్పు తదితరులు

పోలీసుల తనిఖీల్లో రూ.5 లక్షల నగదు పట్టివేత

కల్లూరు, మార్చి 20: పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో బుధవారం నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో రూ: 5 లక్షల నగదును సీజ్ చేసినటు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ... బుధవారం రాత్రి 7:30 గంటల సమయంలో కల్లూరు పట్టణంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బెంగుళూరు నుంచి తిరుపతికి వెళుతున్న ప్రైవేటు బస్సును పోలీసులు తనిఖీచేశారు. సోమలకు చెందిన వ్యాపారి నన్వర్‌లాల్ వద్ద రూ.5 లక్షల నగదును పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన ఇతను సోమలలో మాతాజి బంగారు నగలు దుకాణం నడుపుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకెళుతున్న రూ.5 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



నగదుతో పట్టుబడిన వ్యక్తిని విచారిస్తున్న పోలీసులు

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం



రొంపిచెర్లలో కార్యకర్తలకు అభివాదంచేస్తున్న భువనేశ్వరి

రొంపిచెర్ల, మార్చి 20: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా రాయచోటి నియోజకవర్గం గాలివీడుకు వెళుతున్న నారా భువనేశ్వరికి రొంపిచెర్ల క్రాస్‌లో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డితోపాటు పలువురు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. చల్లాబాబు ఆమెను పలుకరించి అభివాదం తెలిపారు. గుమ్మడికాయ దిష్టి తీశారు. మహిళలు మంగళహారతులు పట్టారు. టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని భువనేశ్వరి కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాలరమణ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరు హరిబాబు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ నాయకులు షేక్ కరీముల్లా, ఇమ్రాన్‌ఖాన్, ఓబులేశ్వరరెడ్డి, నాయకులు నాగరాజ, శశికుమార్, రఫీ, అబూబకర్, మదనమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీకి ఓటుతో భవిష్యత్తు బాగు



కెంచనబల్లలో నారాయణాచారి తదితరులు

రామకుప్పం, మార్చి 20: రాష్ట్రంలో అందరి భవిష్యత్తు బాగుండాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి కోరారు. బుధవారం రాత్రి ఆయన రామకుప్పం మండలం కెంచనబల్ల, గాంధీనగరం గ్రామాల్లో చంద్రబాబు తరఫున ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, అరాచకం, దౌర్జన్యాలు పెరిగిపోయి అన్నివర్గాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. పల్లెల్లో అభివృద్ధి పనులు ఆగిపోవడమే కాకుండా, వైసీపీ శ్రేణులు కక్షపూరిత చర్యలకు పాల్పడి అశాంతిని నెలకొల్పారన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే పరిపాలనదక్షుడైన చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు కూడా ఏకమొత్తంగా టీడీపీకి ఓట్లు వేసి చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, సత్తి, రమేష్, బద్రీ, గుణశేఖర్, రామంజులు, సుబ్రహ్మణ్యం, వెంకట్రామ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

పలమనేరు, మార్చి20 : పలమనేరు మండలంలోని 6 పరీక్షా కేంద్రాల్లో 10వ తరగతి ఆంగ్లం పరీక్షలకు 10 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం తెలిపారు. మొత్తం 1307 మంది పరీక్షలు రాయాల్సి వుండగా 1297 మంది రాశారన్నారు.

రొంపిచెర్ల : రొంపిచెర్ల మండలంలో ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 302 మంది పరీక్షకు హాజరుకావల్సి వుండగా 8 మంది గైర్హాజరు అయినట్లు పరీక్ష చీఫ్ అధికారులు వెంకటరమణారెడ్డి, మంజువాణి తెలిపారు.

పొలాల గట్లకు నిప్పు



పుంగనూరు రూరల్, మార్చి20: మండలంలోని ఆరడిగుంట, పెద్దకొండచర్ల గ్రామాల వద్ద బుధవారం పొలాల గట్లకు నిప్పుపెట్టడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్, మలబరి పంట దెబ్బతిన్నట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. పొలాల గట్లుకు నిప్పు పెట్టడం వల్ల పక్క పొలాల్లో ఉన్న పంటలు దెబ్బతింటాయని తెలిపారు.

బాబుతోనే భావితరాలకు బంగారు భవిష్యత్తు



చిన్నకర్లగట్టలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

శాంతిపురం, మార్చి 20: టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రంలో భావి తరాలకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ శాంతిపురం మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు తెలిపారు. బుధవారం వారు మండల పరిధి వెంకటాపురం, చిన్నకర్లగట్ట చీమనపల్లె, కర్లగట్ట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనలో రాష్ట్రంలో పేదలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడ్డారన్నారు. కార్యక్రమంలో నేతలు సురేష్‌బాబు, విజయరామిరెడ్డి, ఉదయ్‌కుమార్, చంద్రశేఖర్, మణి, గోపాల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను చూసి ఆదరించండి

సోమల, మార్చి 20: వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఆదరించాలని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కోరారు. బుధవారం సోమల మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, జింకా వెంకటా చలపతి, ఎంపీపీ ఈశ్వరయ్య, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, మోహన్, వీవీ రమణ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కురబ సంఘం అధ్యక్షుడిగా రాజగోపాల్



కుప్పం, మార్చి 20: తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా కురబ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కుప్పం నియోజకవర్గం వానగుట్టపల్లెకు చెందిన ఎం.రాజగోపాల్ నియమితులయ్యారు. రాష్ట్ర కురబ సంఘం అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ టీడీపీ విజయంతోపాటు, కురబ కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

శేష వాహనంపై విహరించిన శ్రీవారు



సోమల, మార్చి 20: ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను శేష వాహనంపై అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించి అభిషేక పూజలు జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు అర్చకులు హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఉభయదారులు ఉత్సవమూర్తులను పల్లకిలో అలంకరించి ఊరేగించారు. కార్యక్రమాల్లో పెద్దఉప్పరపల్లె, పేటూరు, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లోని ఆర్యవైశ్యులు, టీటీడీ అధికారులు పర్యవేక్షించారు.

మహాభారతం ఉత్సవాల ప్రారంభం



కల్లూరు, మార్చి 20: పులిచెర్ల మండలం దిగువపోకల వారిపల్లి పంచాయతీ ఎలకబైలు సమీపంలో బుధవారం మహాభారతం ఉత్సవాలు ప్రారంభమయ్యా యి. మహాభారత యజ్ఞం ప్రాంగణంలో బుధవారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం భాగవతారిణి పూర్ణిమ వ్యాస జననం హరికథను భక్తులకు వినిపించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వృథాగా బోరుబావి నీరు



కల్లూరు, మార్చి 20: పులిచెర్ల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని బోరుబావి నీరు వృథాగా పోతోంది. ఈ బోరు కల్లూరు నుంచి పులిచెర్లకు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్నా నీటి వృథాను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను అడగగా నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం



కల్లూరు, మార్చి 20: పులిచెర్ల మండలం దిగువపోకల వారిపల్లి పంచాయతీలోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైనట్లు కళాశాల చైర్మన్ అవినాష్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు, ఆధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో 102 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఈశ్వర్ సురేంద్ర, నాగవేణి, మమతాలక్ష్మి, అమరావతి, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాణ నారాయణమూర్తికి నేడు ప్రత్యేక పూజలు

పలమనేరు, మార్చి 20 : పట్టణ సమీపం విష్ణుపురిలో వెలసిన నిర్వాణ నారాయణ స్వామికి ఈనెల 21వ తేది ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త భోగనాథం సురేష్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 11.55 గంటలకు స్వామివారికి పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త చంద్రమౌళి ఉభయదారుగా వచ్చారని తెలిపారు.

సింహ వాహనంపై ఊరేగిన శ్రీవారు



పుంగనూరు రూరల్, మార్చి20: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి బుధవారం సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని ఉదయాన్నే సుప్రభాతంతో మేల్కొల్పి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్ప పల్లకిలో సింహ వాహనంపై మంగళవాయిద్యాల మధ్య పురవీధుల్లో ఊరేగించగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి



చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కొత్త అధ్యక్షుడిగా నియమితులైన సీ.ఆర్.రాజన్‌తో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, టీడీపీ నేత దగ్గుమళ్ల ప్రసాదరావును బుధవారం తిరుపతి జిల్లా తిరుచానూరు వద్ద ఒక కన్వెన్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో శాలువలు కప్పి, పూలబొకేలు ఇచ్చి సన్మానిస్తున్న గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి చెందిన బీసీ నేతలు శ్రీధర్‌యాదవ్, గురసాల కిషన్‌చంద్, చాణక్య ప్రతాప్, చంద్రబాబురెడ్డి, తిమ్మరాజులు, కిరణ్ తదితరులు
- గంగాధరనెల్లూరు, వెదురుకుప్పం

రాక్షస పాలన నుంచి విముక్తికై ఎదురుచూపులు
- పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్



తిరుమల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న రాక్షస పాలన నుంచి విముక్తి కోసం ప్రజలందరూ ఎదురుచూస్తున్నారని టీడీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సీఎం కావాలని, పూతలపట్టు నియోజకవర్గం నుంచి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. ప్రస్తుత పాలన నుంచి విముక్తి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్న తరుణంలో మోదీ, బాబు, పవన్ కలిసి ఎన్నికల బరిలో దిగుతున్నారన్నారు. త్వరలో మంచి రోజులు రాబోతున్నాయన్నారు.

ఉద్యోగాలకు 54 మంది విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

కార్వేటినగరం, మార్చి 20: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16వ తేదీన నిర్వహించిన మెగా జాబ్ మేళాలో కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 74 మంది పాల్గొనగా, 54 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి తెలిపారు. జాబ్ మేళాలో యంగ్ ఇండియా, జీకేహెచ్‌ఆర్ సొల్యూషన్స్ తదితర కంపెనీ ఉద్యోగాలకు సంబంధించి బుధవారం ధ్రువీకరణ పత్రాలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేకేసీ, ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థల ద్వారా ఇస్తున్న ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీ.ఎస్.లత, మెంటార్ టి.లోకేశ్వర్, అధ్యాపకులు ధనంజయ రెడ్డి, సుబ్బారావు, హరిబాబు, పీడీ జోగి ప్రసాద్, లావణ్య, అన్బులగన్, భార్గవి, ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు ఉన్నారు.

ఐరాలలో కేంద్ర బలగాల కవాతు

ఐరాల, మార్చి 20: మండల కేంద్రమైన ఐరాలలో బుధవారం సాయంత్రం కేంద్ర బలగాలు కల్లూరు సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో కవాతు నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినందున కేంద్ర బలగాలు కవాతు నిర్వహించి ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. అదేవిధంగా ఐరాల పోలీస్ స్టేషన్ పరిధిలో పలు పంచాయతీల్లో కూడా వారు కవాతు చేశారు. ఈ కార్యక్రమంలో ఐరాల ఎస్ఐ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి విశేష ఆదరణ



సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న చినబాబు

విజయపురం, మార్చి 20: టీడీపీకి విశేష ఆదరణ లభిస్తుందని చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలో నారపరాజుకండ్రిగ, మల్లారెడ్డి కండ్రిగ పంచాయతీల్లో జనసేన, టీడీపీ నేతలు బాబు సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి, పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు తగ్గాలన్నా, యువతకు ఉపాధి కలగాలన్నా టీడీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ధనుంజయయాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు గుణభూషణమ్మ, బాలసుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజు, రాఘవులు, మునిశేఖర్ శెట్టి, సమరసింహారెడ్డి, నాథముని, నాగరాజు, సుధాకర్‌రాజు, చిన్నబ్బరాజు, సురేష్‌రాజు, కొండూరు దామోదర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ



చిందరవందరగా పడివున్న దుస్తులు

పూతలపట్టు, మార్చి 20: మండలంలోని బందార్లపల్లె గ్రామంలోని మూడు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వడ్డేపల్లి పంచాయతీ బందార్లపల్లె గ్రామంలోని నరసింహులు నాయుడు తమ కుటుంబసభ్యులతో కలసి పని నిమిత్తం బెంగళూరు వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి తాళం వేసివున్న ఇంటి తలుపులు పగులగొట్టి, ఇంట్లో వున్న టీవీ, రూ.20 వేలు నగదును దోచుకెళ్లారు. అదేవిధంగా పక్కనే వున్న భాగ్యమ్మ, ఆదెమ్మ ఇళ్లలో కూడా చొరబడి బీరువాల్లోని వస్తువులను కిందపడేసి, అందులో వున్న బంగారు ఆభరణాలను తీసుకెళ్లిపోయారు. మంగళవారం మధ్యాహ్నం నరసింహులు నాయుడు ఇంటి వద్దకు పని నిమిత్తం బంధువులు రాగా, తలుపులు తెరచి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే బుధవారం చిత్తూరు నుంచి క్లూస్ టీమ్ వచ్చి దొంగతనం జరిగిన ఇళ్లల్లో వేలిముద్రలను సేకరించారు.

గుండెపోటుతో తమిళనాడు వాసి మృతి



చిత్తూరు, మార్చి 20: గుండెపోటుతో తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు... తమిళనాడులోని షోలింగర్‌కు చెందిన ఓ వ్యక్తి(55) చిత్తూరుకు వచ్చాడు. ఓ మెడికల్ షాపులో మందుల కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ఫిట్స్ వచ్చాయి. దాంతో ఆయన ఉన్నఫళంగా కిందపడిపోయాడు. 108కు సమాచారం వెళ్లడంతో సిబ్బంది వచ్చి పరీక్షించేలోపే ఆయన మృతి చెందాడు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

పెనుమూరు, మార్చి 20: మండలంలోని చిన్నకలికిరి గ్రామానికి చెందిన వ్యక్తులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు బుధవారం ఎస్ఐ లోకేశ్ తెలిపారు. ఆ గ్రామానికి పక్కనే ఉన్న నీవానదిలో నుంచి ఇసుక తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో

శ్రీరంగరాజపురం, మార్చి 20: ఎస్ఆర్‌పురం మండలంలోని 49.కొత్తపల్లెమిట్ట, ఎస్ఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం డీఈవో దేవరాజులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పరీక్షలు బాగా రాసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రెండు నెలల్లో వైసీపీ కనుమరుగు

గంగాధరనెల్లూరు, మార్చి 20: రాష్ట్రంలో మరో రెండునెలల్లో ప్రజలందరూ ఆశించే టీడీపీ ప్రభుత్వం అధికారంలో కూర్చోనుందని, అదే విధంగా ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వం అధికారం నుంచి కనుమరుగు కానుందని జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలసి పోటీ చేస్తుండటంతో వైసీపీకి గుబులు పట్టుకుందన్నారు.

ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలి

తవణంపల్లె, మార్చి 20: ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేసి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అధికారులకు తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయలో వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకులకు సంబంధించిన బోర్డులు, ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎంఈవో త్యాగరాజులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో టీడీపీదే విజయం

● కార్లతో ర్యాలీగా వచ్చి గురజాలను కలసిన కోలా కిరణ్



గురజాల జగన్మోహన్‌తో కోలా కిరణ్ తదితరులు

చిత్తూరు సిటీ, మార్చి 20: ప్రజల ఆశీర్వాదంతోనే టీడీపీ ఘనవిజయం సాధిస్తుందని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ చెప్పారు. నగరపాలక కో-ఆప్షన్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్, వైసీపీ నేత కోలా కిరణ్ బుధవారం భారీ ఎత్తున కార్లతో ర్యాలీగా వచ్చి గురజాల జగన్మోహన్‌ను కలిసి మద్దతు తెలిపారు. ఇటీవల ఆయన విజయవాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. నగరంలోని రామ్‌నగర్‌కాలనీ నుంచి దర్గాసర్కిల్, ఎమ్మెస్సార్ సర్కిల్, గాంధీ సర్కిల్, కొత్తబస్టాండు మీదుగా బీవీ రెడ్డికాలనీలోని జీజేఎం కార్యాలయం వరకు కారు ర్యాలీగా వెళ్లారు. సుమారు 100 మందికి పైగా అనుచరులతో గురజాలను కలసి దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. గురజాల మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలో అన్ని వర్గాల వారు తనను ఆదరిస్తున్నారని చెప్పారు. కోలా కిరణ్ మాట్లాడుతూ గురజాల జగన్మోహన్ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్ర కుమార్, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు అశోక్ ఆనంద్ యాదవ్, రాజశేఖర్, ఓఎం రామ్‌దాస్, వాసు, నవీన్, ప్రకాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

తాను ఎమ్మెల్యే అయిన వెంటనే నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ చెప్పారు. బుధవారం నగరంలోని లాయర్స్ కాలనీలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో కాలనీల్లో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. తనను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

పదార్థ విజ్ఞాన శాస్త్రంపై ముగిసిన శిక్షణ



ముగింపు సమావేశంలో ప్రసంగిస్తున్న గుణశేఖరన్

నగరి, మార్చి 20: నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పదార్థ విజ్ఞాన శాస్త్రంలో ఆవిష్కరణలు - పురోగతులు అనే అంశంపై విద్యార్థులకు మూడు రోజులపాటు జరిగిన శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ముగింపు రోజు తిరుపతికి చెందిన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య విజయలక్ష్మి పర్యావరణ కాలుష్య క్షీణతకు కాంతి ఉత్ప్రేరక పదార్థాల అభివృద్ధి, హైడ్రోజన్ ఇంధన ఉత్పత్తి కోసం నానో సంయుక్తాల రూపకల్పన అభివృద్ధి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. చెన్నై నుంచి వచ్చిన ఆచార్య గుణశేఖరన్ మాట్లాడుతూ పరమాణువులు - అణువర్ణ పటశాస్త్రం గురించి పరిశోధనాత్మక కోణంలో వివరించారు. పీటర్స్ ఉన్నత విద్యా పరిశోధక సంస్థకు చెందిన ఆచార్య జనని అంతర పరావర్తన క్షీణత - పదార్థాల శోధనకు వరం అనే అంశం గురించి వివరించారు. ఈ మూడురోజుల శిక్షణా కార్యక్రమం విద్యార్థులకు పరిశోధనాత్మక రంగంలో మంచి పట్టు సాధించేలా ఉపయోగపడుతుందని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. డాక్టర్ రమేష్, డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, డాక్టర్ అరుణకుమారి, చిన్నపాపమ్మ, సుహాసిని, శ్రీలక్ష్మి, ఉమామహేశ్వరి, పంకజం, రేవతి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

థామస్‌ను గెలిపించండి



పథకాల గురించి వివరిస్తున్న అరుళ్‌నాథన్ తదితరులు

పాలసముద్రం, మార్చి 20: అసెంబ్లీ ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి అరుళ్‌నాథన్ ఓటర్లను కోరారు. మండలంలోని అముదాల, అముదాల దళితవాడ, జయలక్ష్మీపురం గ్రామాల్లో బుధవారం ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి, వివరించారు. నాయకులు వినోద్‌కుమార్, నాగరత్నం నాయుడు, కుమార్, బాలకృష్ణమ నాయుడు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు 'సూపర్ సిక్స్' పట్ల ఆకర్షితులమయ్యాం
- ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు



టీడీపీలో చేరిన యువకులతో థామస్, యుగంధర్, గురుసాల కిషన్‌చంద్

వెదురుకుప్పం, మార్చి 20: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల పట్ల ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు వెదురుకుప్పం మండలం చవటగుంట యువకులు తెలిపారు. టీడీపీ ఎన్ఆర్ఐ నియోజకవర్గ కో-ఆర్డినేటరు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గురుసాల కిషన్‌చంద్ సారథ్యంలో బుధవారం చవటగుంటకు చెందిన సుమారు 30 మంది యువకులు వివిధ పార్టీల నుంచి టీడీపీలో చేరారు. వీరికి గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. యువకులు మాట్లాడుతూ థామస్ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. పార్టీ అండదండలు ఉంటాయని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని యువకులకు థామస్ సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బట్టే చాణిక్యప్రతాప్, యువనాయకులు ప్రభు, దయ, ముత్తు, సూర్య, ప్రవీణ్, హరి, ముని పాల్గొన్నారు.

గురజాల గెలుపునకు కృషి చేయండి



మాట్లాడుతున్న చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, మార్చి 20: విభేదాలు పక్కన పెట్టి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గురజాల జగన్మోహన్, ప్రసాద్‌రావు గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్తూరు రూరల్ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు రూరల్ మండలం అంటేనే టీడీపీకి కంచుకోటని అన్నారు. ప్రతి ఎన్నికల్లో కూడా ఇది రుజువైందన్నారు. ఈ ఎన్నికలలో కూడా ప్రతి నాయకుడు, కార్యకర్తలు చిన్న చిన్న విభేదాలు ఉన్నా పక్కన పెట్టి కూటమి గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కష్టపడి పనిచేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని 17 పంచాయతీల్లో ఒక్కో పంచాయతీకి చెందిన నాయకులు, కార్యకర్తలతో వార్ రూంలో ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. అందురు కలసికట్టుగా పనిచేస్తేనే గెలుపు సాధ్యమని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్, దేవరాజులు నాయుడు, మంజూష్, జగదీష్ నాయుడు, నీలకంఠం నాయుడు, కుమార్, దిల్లీప్, రమేష్ నాయుడు, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

గురజాలను గెలిపించుకుందాం: బీజేపీ

గుడిపాల, మార్చి 20: చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడును గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల బీజేపీ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, ఆ పార్టీ రాష్ట్ర ఎలక్షన్ కమిటీ సభ్యుడు చిట్టిబాబు అన్నారు. బుధవారం కీలారిపల్లిలో మండల బీజేపీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పొత్తులో భాగంగా మన మండలానికి చెందిన గురజాల జగన్మోహన్ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమనాథ్ గౌడ్, శేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

చిత్తూరు రూరల్, మార్చి 20: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం విజయభాస్కర్ తెలిపారు. బుధవారం చిత్తూరు మహిళా సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవసమాజ నిర్మాణానికి ఓటు కీలకమని చెప్పారు. ఓటు కలిగి ఉండడం గొప్ప కాదని, దానిని ఉపయోగించినప్పుడే విలువ ఉంటుందని తెలిపారు. ఇప్పటికీ ఓటు లేని వారు వెంటనే ఓటు నమోదు చేసుకునేలా డ్వాక్రా మహిళలు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మహిళలు మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు.

స్కానింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలి:డీఐవో



మాట్లాడుతున్న డీఐవో రవిరాజు

చిత్తూరు రూరల్, మార్చి 20: చిత్తూరు డివిజన్ పరిధిలోని స్కానింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలని డీఐవో రవిరాజు అధికారులకు సూచించారు. బుధవారం చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ డివిజన్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మండల స్థాయిలో పీసీపీఎన్‌డీటీ సమావేశం నిర్వహించాలన్నారు. విరివిగా ఆయా ప్రాంతాల్లో ఉన్న స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులను హెచ్చరించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన వైద్యులతో పాటు గర్భిణీ కూడా శిక్షార్హురాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో గైనకాలజిస్టులు లత, ఉషశ్రీ, రేడియాలజిస్ట్ చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



సభ్యత్వ నమోదు చేస్తున్న డాక్టర్ నరసింహులు

శ్రీరంగరాజపురం, మార్చి 20: కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ నరసింహులు తెలిపారు. బుధవారం ఆరిమాకుపల్లెలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలు బాగుపడాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్‌రెడ్డి, జిల్లా సేవాదళ మాజీ అధ్యక్షుడు గౌతమ్, మండల అధ్యక్షుడు తులసిమణి, మురళీకృష్ణ, వాసు, దినకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీకే బాబును విమర్శించే హక్కు వైసీపీకి లేదు

గుడిపాల, మార్చి 20: సీకే బాబును విమర్శించే హక్కు వైసీపీ నాయకులకు లేదని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని ఓ వైసీపీ నాయకుడు 40ఏళ్ల రాజకీయ చరిత్ర కల్గిన సీకే బాబును విమర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయన్ను విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

వైభవంగా కేడయ, గజ వాహన సేవలు



గజ వాహన సేవలో పాల్గొన్న భక్తులు

చిత్తూరు కల్చరల్, మార్చి 20: నగరంలో అత్యంత ప్రాశస్త్యం చెందిన కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయ పంగుణి మాస బ్రహ్మోత్సవాలు గత ఏడు రోజులుగా జరుగుతున్నాయి. బుధవారం స్వామి వారికి టి.ఎన్. దేవత, ఆదినారాయణ రెడ్డి, కృతి, సుభాష్‌చంద్రబోస్, రాధిక, ఎఎస్. ధనూజ్‌కుమార్‌ల ఉభయంతో కేడయ ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం వణిగ వైశ్యసంఘం ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు వైభవంగా గజవాహన సేవను జిల్లా గాండ్ల సంఘం చైర్మన్ భూపేష్, ఈవో తిమ్మారెడ్డి, అర్చకులు శివాచార్యులు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు శివప్రసాద్, కాళభైరవట్రస్టు వ్యవస్థాపకులు టి. వెంకటేషన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

ఐరాల, మార్చి 20: ఉపాధి కూలీలకు కచ్చితంగా వంద రోజుల పాటు పని కల్పించాలని డ్వామా పీడీ రాజశేఖర్ సూచించారు. గురువారం ఆయన వైఎస్.గేటులో కూలీలు చేస్తున్న డీసెల్టింగ్ పనులను, మద్దిపట్లపల్లెలో రోజాపూల పెంపకం, ముదిగోళంలో ఫారంపాండు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ఎండలు ఎక్కువ ఉన్నందున ఉదయం 6 గంటల నుంచి 11గంటల వరకు కూలీలు పనులు చేయాలని చెప్పారు. వీలైతే సాయంత్రం వేళల్లో కూడా పనులను నిర్వహించుకోవచ్చునన్నారు. ఏపీడీ శ్రీనివాసులు, ఏపీవో సంధ్యారాణి, టెక్నికల్ అసిస్టెంట్లు శరత్‌బాబు, భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్లు భానుప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

పూతలపట్టులో...

పూతలపట్టు, మార్చి 20: మండలంలోని వడ్డేపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న పలు ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ రాజశేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు ఉపాధి హామి పనులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలువురు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

శేష వాహనంపై కరకంఠేశ్వరుడి విహారం

నగరి, మార్చి 20: నగరి పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పంగుణోత్తర బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు శేష వాహనంపై విహరిస్తూ భక్తులకు కనువిందు కలిగించారు. వేదపండితులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామివారు మాడవీధుల్లో శేష వాహనంపై ఊరేగడంతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన భానుప్రకాష్



టీడీపీ కార్యకర్త మృతికి నివాళి అర్పిస్తున్న భానుప్రకాష్

నగరి, మార్చి 20: నగరి మండల పరిధిలోని అడవికొత్తూరుకు చెందిన టీడీపీ కార్యకర్త పొన్నురంగం మృతి చెందడంతో బుధవారం ఆయన మృతదేహానికి నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. పొన్నురంగం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, నగరి మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, దామురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జంబాడలో...

విజయపురం, మార్చి 20: మాజీ జడ్పీటీసీ సుజాతమ్మ భర్త విశ్వనాథరాజు అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం జంబాడలో వారి కుటుంబాన్ని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పరామర్శించారు. విశ్వనాథరాజు చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఖజానా స్ట్రాంగ్‌రూమ్ నుంచి 'స్థానిక' ఎన్నికల పెట్టెల తరలింపు



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20: కలెక్టరేట్‌తో పాటు మండల కేంద్రాల్లోని ఖజానా కార్యాలయాల్లో సంవత్సరాల తరబడి భద్రత కోసం నిల్వవుంచిన వస్తువులను వెంటనే తరలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో గత నెలరోజులుగా ఖజానా కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన వస్తువుల తరలింపులు కొనసాగుతున్నాయి. బుధవారం గ్రామపంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ వంటి స్థానిక ఎన్నికలకు సంబంధించి ఖజానా స్ట్రాంగ్ రూమ్‌లో నిల్వ ఉంచిన మెటీరియల్స్, ట్రంకుపెట్టెలను పంచాయతీరాజ్ శాఖ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య తమ గోదాములకు వాహనాల ద్వారా తరలించారు.